నవతెలంగాణ
ఆదిలాబాద్
1
శనివారం | నవంబర్ 02, 2024 | www.navatelangana.com

ఎన్యూమరేటర్లకు సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో భాగంగా ఎన్యుమరేట్లను శిక్షణలు పూర్తి చేసి సామాగ్రిని అందించామని మున్సిపల్ కమిషన్ సీవీఎస్ రాజు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లుగా నియమించిన ఆశా కార్యకర్తలు, మెప్మా ఆర్పీలు, అంగన్‌వాడీలకు సర్వేపై శిక్షణ ఇచ్చారు. అనంతరం వారికి సర్వేలో ఉపయోగపడే స్టేషనరీని అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు మాట్లాడుతూ నవంబర్ 6 నుంచి ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టనుందన్నారు. అందులో భాగంగానే నియమించిన ఎన్యుమరేటర్లకు శిక్షణతో పాటు స్టేషనరీని పంపిణీ చేశామన్నారు. పట్టణంలోని 49 వార్డుల్లో 371 ఈపీలను గుర్తించి 385 ఎన్యుమరేటర్లు. 41 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సెయింట్ మేరీ విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



నేటి నుండి ఈ నెల 4 వరకు జిల్లా కేంద్రాలు జరగనున్న 38వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీలకు స్థానిక సెయింట్ మేరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అడప శాశ్వత, హిమబిందులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లిబిన్, కరస్పాండెంట్ సిస్టర్ అని మాథ్యు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థాయికి విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థుల క్రీడాభివద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీడీ కడతల రాకేష్, పీఈటీలు బొమ్మకంటి కిరణ్, అర్చన కుమారి, ఆత్రం బద్రి పాఠశాల ఉపధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

- మూడు ద్విచవాహనాలు స్వాధీనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఆయా కాలనీల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన దొంగను టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ కరుణకర్ రావు వివరాలను వెల్లడించారు. ఇటీవల వరలక్ష్మీనగర్‌లో కాలకృత్యాలను తీర్చుకోవడానికి వెళ్లిన వ్యక్తి వాహనం దొంగతనానికి గురైంది. ఇదే విషయమై బాధితుడు టూ టౌన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. శుక్రవారం ఉదయం క్రాంతినగర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఎస్సై విష్ణు ప్రకాష్ అనుమానస్పదంగా ఉన్న అదే కాలనీకి చెందిన గంగాధర్‌ను విచారించారు. అయితే అతను వరలక్ష్మీనగర్‌లో వాహనంతో పాటు రిమ్స్, అశోక్ రోడ్డులో నుంచి మరో వాహనం దొంగలించినట్లు ఒప్పుకున్నారన్నారు. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి మూడు వాహనాలతో పాటు ఒక సెల్ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిపై గతంలో కూడా ఆటో దొంగతనం కేసు ఉందని, వన్ టౌన్‌లో కూడా ఒక కేసు ఉందని తెలిపారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా దొంగను పట్టుకున్న ఎస్సైతో పాటు ఐడీ పార్టీ, సివిల్ పోలీసులను అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా టపాసుల దుకాణాలు

- సంత అని తెలిసి అనుమతులు ఎలా ఇచ్చారు..?



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటిలోని గురువారం జరిగే వారపు సంతలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలతో సంతకు వస్తున్న ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సంతకు వచ్చిన ప్రజలు భయభ్రాంతుల మధ్య సంత చేయాల్సి వచ్చిందన్నారు. గోలేటి వారసంత ప్రక్కన సింగరేణి సబ్ స్టేషన్ 33/11 కేవీ సబ్ స్టేషన్ కూడా ఉంది. ఇవి అన్ని తెలిసి కూడా అధికారులు టపాసుల దుకాణాలకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దుకాణాలు ఫైర్ సెఫ్టీకి సంబంధించిన డ్రమ్ములు ఖాళీగా ఉన్నాయి తప్ప అందులో నీరు నిలువలేదు. అదేవిధంగా ఇసుక అక్కడ ఉండాలి కానీ టపాసుల దుకాణాల యజమానులు ఇసుక అక్కడ పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి కానీ ఇవేమి పటించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందికరమైన టపాసుల దుకాణాలను రాబోయే కాలంలో వేరేచోట మార్చాలని కోరుతున్నారు.

వాట్సప్ అడ్మిన్‌లు బాధ్యతగా వ్యవహరించాలి

- దుష్ప్రచారం చేసిన వారిపై చర్యలు తప్పవు
- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సోషల్ మీడియాలో, వాట్సప్ గ్రూప్ అడ్మిన్లు దుష్ప్రచారాలపై బాధ్యతతో వ్యవహరించాలని డీఎస్పీ జీవన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీచౌక్ ప్రదేశంలో గత రాత్రి గొడవ జరిగినట్టుగా కొన్ని వాట్సఅప్ గ్రూపులలో గతంలో జరిగిన వీడియోలను ప్రస్తుతం జరిగినట్టు దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరిస్తున్నట్లు పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాల కిందట జరిగిన సంఘటన వీడియోలను ప్రస్తుతం వాట్సాప్ గ్రూపులలో సర్క్యులేట్ చేస్తున్న వారిపై, పోస్టులు చేసిన వారిపై, గ్రూపుల అడ్మిన్లు తొలగించకపోయిన జిల్లా పోలీస్ సోషల్ మీడియా యంత్రాంగం గమనిస్తూ చట్టపరమైన చర్యలను తీసుకుంటుందని పేర్కొన్నారు. వాట్సాప్ గ్రూపు అడ్మిన్లు అప్రమత్తతో వ్యవహరిస్తూ, ఇలాంటి దుష్ప్రచారాలు ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా ఉండాలని ఒకవేళ గ్రూపులో వచ్చినట్లయితే వాటిని వెంటనే తీసివేయాలని పేర్కొన్నారు. కావాలని ఎవరైనా ప్రశాంత వాతావరణ చెడగొట్టాలని ప్రయత్నం చేసినచో, రెచ్చగొట్టేలా వ్యవహరించిన, ఇలాంటి వీడియోలని ఫార్వర్డ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పండగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేటట్టు బందోబస్తు ప్రక్రియను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

బేస్ క్యాంప్ వాచర్ కుటుంబ సభ్యుల ఆందోళన

నవతెలంగాణ-కడెం

మండలంలోని కొలంగూడ గ్రామానికి చెందిన కుమ్రం సంతోష్ ఫారెస్ట్ వాచర్‌గా పని చేస్తున్న క్రమంలో గత 27న ఆదివారం సంతోష్‌ను ఇంట్లో నుంచి కడెం సెక్షన్ ఆఫీసర్ రవికుమార్ విధులకని చెప్పి తీసుకు వెళ్లగా తిరిగి రోజు మాదిరిగా సాయంత్రం ఇంటికి సంతోష్ వెళ్లకపోవడంతో సంతోష్ కుటుంబ సభ్యులు అటవీ రేంజి కార్యాలయంలో సంబంధిత అధికారులను అడిగి ఈనెల 29న పోలీసులకు మిస్సింగ్ కేసు ఫిర్యాదు చేశారు. అయితే కలప స్మగ్లింగ్ విషయంలో వాచర్ సంతోష్ పాత్ర ఉందని, ఫారెస్ట్ అధికారుల విచారణలో గత ఆదివారం కొట్టడంతోనే 5 రోజులుగా సంతోష్ కనబడకుండా పోయాడని, సంతోష్ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్ఆర్ఓ గీతారాణి, సంబంధిత సెక్షన్ అధికారి రవి కుమార్‌ను నిలదీశారు. మా సంతోష్ ఎ విధంగా ఇంట్లో నుంచి తీసుకువెళ్లారో అదే విధంగా మాకు అప్పగించాలని ఫారెస్ట్ కార్యాలయం ముందు బైఠాయించి డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు సంతోష్‌ను వెతకడం ముమ్మరం చేసి ఎలాగైనా తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వడంతో సంతోష్ కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

కసరత్తు షురూ..!

- సామాజిక, ఆర్థిక సర్వేకు యంత్రాంగం సంసిద్ధం
- జిల్లాలో 6 నుంచి ఇండ్ల జాబితా గుర్తింపు.. అనంతరం ఇంటింటి సర్వే
- ఎన్యూమరేటర్లు..సూపర్‌వైజర్ల నియామకం పూర్తి



ఉమ్మడి జిల్లాలో సామాజిక, ఆర్థిక సర్వేకు సమయం ఆసన్నమైంది. ఈ క్రతువులో భాగంగా అధికార యంత్రాంగం ఇండ్ల గుర్తింపు ప్రక్రియను చేపడుతోంది. శుక్రవారం ప్రారంభం కావాల్సిన ఇండ్ల జాబితను ప్రభుత్వం ఈ నెల 6వ తేదికి వాయిదా వేసింది. తొలుత గుర్తించిన ఇండ్లకు స్టిక్కర్లు అతికించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాతనే అధికార యంత్రాంగం ఇంటింటి సర్వే చేపట్టనుంది. ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులను నియమించి 4న సర్వేకు సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం వీరిని సర్వేకు సన్నద్ధం చేయనున్నారు. తాజాగా ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా స్వయంగా భీంపూర్ మండలంలో పర్యటించి సర్వేకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఈ సర్వే నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తాను నియమించారు.

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టాలని నిర్ణయించింది. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు అభ్యున్నతి కోసం ఈ సర్వే చేపడుతున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రారంభించింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేపట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే రాష్ట్ర బీసీ కమిషన్ ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించి ఉమ్మడి జిల్లా వారీగా కుల సంఘాల వారీగా అభిప్రాయాలు సేకరించింది. బహిరంగ విచారణ చేపట్టి ఆయా సంఘాల నుంచి వినతులు స్వీకరించింది. త్వరలోనే చేపట్టబోయే సర్వే ప్రాధాన్యతను వివరించింది. ఇందులో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. జిల్లా అధికార యంత్రాంగం ఇందుకు సంబంధించిన కసరత్తు మొదలుపెట్టింది. ఇండ్ల జాబితా రూపొందించి వాటికి స్టిక్కర్లు అతికిస్తోంది. ఇప్పటికే సర్వేకు సంబంధించిన సిబ్బందికి శిక్షణాలు ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాలో 18 మండలాల పరిధిలో 1,62,046 కుటుంబాల పరిధిలో 7,08972 జనాభా ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో 1816 ఎన్యూమరేషన్ బ్లాక్‌లను గుర్తించారు.

56 అంశాల్లో వివరాల సేకరణ

ఈ నెలలో అధికారికంగా ఇంటింటి సర్వేను ప్రారంభించనున్నారు. సర్వే ప్రొఫార్మాలో 56ప్రశ్నలు ఉండగా.. 76 ఉప ప్రశ్నలు రూపొందించారు. వీటి ఆధారంగా కుటుంబ సభ్యుల సమగ్ర సమాచారం సేకరించనున్నారు. సాధారణ వివరాలతో పాటు విద్య, ఉద్యోగం, ఉపాధి, భూమి, కులం, రిజర్వేషన్ల ప్రయోజనాలు, రాజకీయాల వివరాలు, వలసవెళ్లిన వారి వివరాలు, వివిధ సంస్థల నుంచి తీసుకున్న రుణ వివరాలు, పశు సంపద, స్థిర, చరాస్తుల వివరాలన్నింటినీ సేకరించనున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా చేపట్టే ఈ సర్వేలో వివరాలు అందించేందుకు కుటుంబ యజమాని అందుబాటులో ఉండాలని అధికారవర్గాలు చెబుతున్నాయి.

సర్వే ఆధారంగానే రిజర్వేషన్లు..?

ప్రభుత్వం తాజాగా చేపడుతున్న సామాజిక సర్వే ఆధారంగానే రానున్న రోజుల్లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు తెలిసింది. ఆయా కులాల జనాభాతో పాటు వారి సామాజిక పరిస్థితులు సైతం సర్వే ద్వారా స్పష్టంగా తెలిసే అవకాశం ఉండటంతో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలతో పాటు రాజకీయంగానూ వారికి అవకాశాలు కల్పించేందుకు తాజా సర్వే దోహదం చేయనుందని తెలిసింది. రానున్న సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ తాజాగా వెల్లడయ్యే జనాభా లెక్కల ఆధారంగానే రిజర్వేషన్లు కేటాయించే అవకాశం కనిపిస్తోంది. బీసీ కుల గణన చేపట్టిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఆయా సంఘాలు పట్టుబట్టిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం సైతం కుల గణన చేపడుతామని ఎన్నికల సందర్భంగా హామీనివ్వడం.. తాజాగా సర్వేకు రూపకల్పన చేయడం వంటి పరిణామాలు వేగంగా జరుగుతున్నాయి. బీసీ కులాలతో పాటు అన్ని అన్ని కులాల సమగ్ర వివరాలు తెలియనుండటంతో ఈ సర్వేపై అందరూ ఆసక్తి కనబరుస్తున్నారు.

సీపీఐ(ఎం) మహాసభలు జయప్రదం చేయాలి

- ఈ నెల 28, 29న జిల్లా 13వ మహాసభలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా సీపీఐ(ఎం) 13వ మహాసభలను నవంబర్ 28, 29 తేదీలలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి దాతలు, శ్రేయోభిలాషులు, ఆర్థిక, హార్థిక సహాయ, సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ మాట్లాడుతూ జిల్లా మహాసభలు ఈ నెల 28, 29న పట్టణంలో జరుగనున్నట్టు స్పష్టం చేశారు. సీపీఐ(ఎం) తన శక్తిమేరకు ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడిందని, పోరాడుతుందని అన్నారు. జిల్లాను అభివృద్ధి చేయడం కోసం వామపక్ష ప్రజాస్వామిక శక్తులను ఏకం చేసి ఐక్య పోరాటలు చేసిందని గుర్తు చేశారు. ప్రధానంగా సీసీఐ సిమెంటు ఫ్యాక్టరీ గురించి, ఏరోడ్రమ్, ఆర్మూర్ రైల్వేలైన్, రైతుల సమస్యల పట్ల అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. పలు సమస్యల పరిష్కారానికి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి, పరిష్కారానికి పోరాటాలు చేశామన్నారు. భవిష్యత్తులో జిల్లా సమగ్రాభివృద్ధికోసం ఐక్య పోరాటాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. మహాసభల్లో ఇందుకోసం తీర్మాణాలు చేస్తామని వెల్లడించారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు బండి దత్త్రాతి, జిల్లా కమిటీ సభ్యులు ఆత్రం కిష్టన్న, బొజ్జ ఆశన్న, ఎం.గంగన్న, ఆర్.సురేందర్, మంజుల పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇంట్లో చోరీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం కోసిని పంచాయతీ పరిధిలోని వైష్ణవి డెవలపర్స్‌లో నివాసముంటున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బీఆర్ఎస్ నాయకులు తెలిపిన ప్రకారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రస్తుతం హైద్రాబాద్‌కు వెళ్లడంతో ఆయన ఇంటికి తాళం వేసి ఉంది. దొంగలు ఆయన ఇంటి తాళం పగులకొట్టి లోనికి వెళ్లి బీరువాలోని విలువైన పత్రాలను అపహరించారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో విచారణ చేపడుతున్నారు.

సాయంత్రం సమయంలోనే చోరీ

కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌లో బుధవారం సాయంత్రం సమయంలోనే చోరీ జరగడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. స్థానికంగా ఫ్రిజ్ రిపేర్ చేసుకొని జీవించే బొల్లు ప్రసాద్ తన కుటుంబసభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం దీపావళి పండుగ సామాగ్రి కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లాడు. రాత్రి 8 గంటలకు తిరిగి వచ్చేసరికి తాళం పగులకొట్టి లోపలి సామాను చిందరవందర చేసి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్ఐలు దీకొండ రమేష్, సుధాకర్‌లు సంఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలతో విచారణ కొనసాగించారు. తన ఇంట్లోని రూ. 96 వేలతో పాటు రూ. 3.44 లక్షల విలువైన బంగారం అపహరణకు గురైనట్లు ప్రసాద్ భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బూటు కాళ్లతో తన్ని.. వాతలు పెట్టి..

- విచారణ పేరిట అనుమానితున్ని చితకబాదిన ఎస్ఐ, కానిస్టేబుల్
- స్పృహ కోల్పోగా పోలీసు వాహనంలోనే మంచిర్యాల ఆస్పత్రికి తరలింపు
- కాగజ్‌నగర్ డీఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు, కుటుంబసభ్యులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పశువులను గాయపరుస్తున్నాడనే అనుమానంతో ఒక వ్యక్తిని దహెగాం పోలీసులు పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆ వ్యక్తిని పోలీసు స్టేషన్‌లో పై అంతస్తుకు తీసుకువెళ్లి చితకబాదడమే కాకుండా కాల్చిన గంటెతో అరికాలిపై వాతలు పెట్టారు. ఈ బాధ భరించలేని ఆ వ్యక్తి స్పృహ కోల్పోగా అతన్ని వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. ఇది కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం పోలీసుస్టేషన్‌లో జరిగింది. బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దహెగాం మండలం అయినం గ్రామానికి చెందిన ఎల్కులె బాపూరావు తన పంట పొలంలోకి పశువులు వస్తుండడంతో వాటిని గత కొన్ని రోజులుగా తరిమికొడుతున్నాడు. ఇందులో కొన్ని పశువులు గాయాలపాలు కావడంతో పశువుల యాజమానులు దహెగాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా దహెగాం పోలీసులు బాపూరావును గురువారం ఉదయం అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వెంట వెళ్లిన భార్య సంగీతను పోలీసు స్టేషన్‌లో కింది అంతస్తులోనే ఉంచి బాపూరావును పై అంతస్తుకు తీసుకువెళ్లి చితకబాదారు. మోకాళ్లలో కట్టెలు పెట్టి వెనుకాల తీవ్రంగా చితకబాదాడని, బూటు కాళ్లతో ఎక్కడ పడితే అక్కడ తన్నుతూ చిత్రహింసలకు గురి చేశారని బాధితుడు వాపోయాడు. గంటెను వేడి చేసి కుడిపాదంపై వాతలు పెట్టడంతో బొబ్బలు వచ్చాయని చెపుతూ గాయాలను చూపిస్తూ రోదించాడు. దహెగాం పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్ సహాయంతో బాధితుని కుటుంబసభ్యులు మంచిర్యాలలో చికిత్స చేసుకొని కాగజ్‌నగర్‌కు వచ్చి డీఎస్పీ రామానుజంను కలిశారు. తనను చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐ రాజు, కానిస్టేబుల్ సర్దార్‌సింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు, అతని కుటుంబసభ్యులు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని డీఎస్పీ హామీ ఇచ్చినట్లు బాధితుని భార్య సంగీత విలేకరులకు వివరించింది.

కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ తొలి హోం మంత్రి సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో 32 బెటాలియన్ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉక్కు మనిషి చిత్రానికి పూలతో నివాళులర్పించి దేశ సమైక్యత కోసం ఆయన చేసిన కృషిని మననం చేసుకున్నారు. ఆయన బాటలోనే సమైక్యత, సమగ్రత కోసం పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం మాట్లాడుతూ సంస్తానాలుగా ఉన్న దేశాన్ని సార్వభౌమత్వ సర్వ సత్తాక రాజ్యంగా మార్చడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, ఎన్.వై.కె సిబ్బంది మజీద్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ చంద్రకాంత్, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పృథ్విరాజ్, అధ్యాపకులు గోపాల్, నరేష్, కునాల్ యాదవ్ పాల్గొన్నారు.

అర్హతగల ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఆయా కళాశాలల విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఓటరు నమోదుతో పాటు సరవణలు దరఖాస్తు చేసుకునే విధానాన్ని తెలియాజేశారు. ముందుగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైందన్నారు. 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. గతంలో సంవత్సరంలో ఒకే సారి నమోదుకు అవకాశం ఉండేదన్నారు. కానీ ఇప్పుడు సంవత్సరంలో నాలుగు సార్లు అవకాశం ఇచ్చారన్నారు. జనవరి, జూలై, ఏప్రిల్, అక్టోబర్ నెలలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. తమతో పాటు ఇతరులను కూడా ఓటరు నమోదు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎన్నికల సూపరింటెండెంట్ పంచపూల, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అటవీ అధికారులు సర్వేను నిలిపివేయాలి

ఆసిఫాబాద్ : తమ భూముల్లో అటవీ అధికారులు చేస్తున్న సర్వే వెంటనే ఆపివేయాలని కాగజ్‌నగర్ మండలం నందిగూడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్తులు మూకుమ్మడిగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా భూములు సాగు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. ప్రస్తుతం అటవీ అధికారులు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నాయంటూ బౌండరీలు ఏర్పాటు చేసి తమ భూములు లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్ 13/1 నుండి 13/30 వరకు, 44/1 నుండి 44/25 వరకు పట్టాలుండి రైతుబంధు వస్తున్నాయని తెలిపారు. అటువంటి భూముల్లో కూడా అటవీ అధికారులు చేస్తున్న సర్వే తమలో ఆందోళన నింపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంటనే కల్పించుకొని సర్వే నిలిపివేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు సోమయ్య, లక్ష్మణ్, భీమయ్య, సుధాకర్, కేశవ్, మధుకర్, నారాయణ, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్మల్ వాసికి సౌదీ అరేబియాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ పట్టణానికి చెందిన సయ్యద్ ముజహిద్ అలీకి శుక్రవారం సౌదీ అరేబియాలోని రియాద్ పట్టణ షాహిన్ గ్రూప్ ఆఫ్ ఎక్సలెన్స్ తరుపున ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. ఈ అవార్డు లభించినందుకు చాలా సంతోషంగా ఉందని ముజహిద్ అన్నారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఖదీర్, ఆయస్ అహ్మద్ ఉన్నారు.



డీఎస్పీని కలిసిన మాల సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఎస్పీ జీవన్ రెడ్డిని శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి, దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించడంలో డీఎస్పీ చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొబ్బిలి సుధాకర్, ఆర్థిక కార్యదర్శి గంపల ప్రభాకర్, నాయకులు మేకల మల్లన్న, బేర దేవన్న, సూరం భగవాండ్లు, దాసరి బాబన్న, పాశం రాఘవేంద్ర, ముచ్చ రఘు, మలపతి జగదీష్, మాదస్తు అర్జున్ పాల్గొన్నారు.



ఘనంగా దండారీ ఉత్సవాలు

- దండారీలకు చెక్కుల అందజేత



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని చర్లపల్లి గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం మండల దండారీలకు రూ.15వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ గిరిజన గ్రామాల్లో ఎంతో ఆనందోత్సవాల మధ్య క్రమశిక్షణతో గుస్సాడీ దండారి పండగను జరుపుకుంటారు. మండలంలో ఇండ్లులేని వారిని గుర్తించి, వివిధ గ్రామాల్లో వారికి ఇండ్లు నిర్మిస్తామన్నారు. కొన్ని గ్రామాల్లో దండారీలకు చెక్కులు అందనప్పటికీ మిగతా వారికి అందే విధంగా కృషి చేస్తానన్నారు. గిరిజనులు ఐక్యతకు పట్టుకొమ్మలు అదేవిధంగా గిరిజనుల సంస్కృతిక సాంప్రదాయాలు ఒక నిబద్ధతగా ఉంటాయన్నారు. డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీపావళి పండుగకు దండారీలకు రూ.10 వేలు అందించగా, కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి వచ్చిన వెంటనే దండారీలకు ప్రతి దండారీ రూ.15వేల చొప్పున అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఇండ్లు లేని వారిని గుర్తించి, ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం మండలంలోని 30 దండారీలకు రూ.15వేల చొప్పున చెక్కులను అందజేశారు. మొదటగా గుస్సాడి నృత్యంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, ఆ పార్టీ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, తిరుమలగౌడ్, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, రమాకాంత్, సుదర్శన్‌రెడ్డి, రాంబాయి, రమేష్, అభిరాంరెడ్డి, జనక్, సునితారెడ్డి, శాస్త్రి, వివిధ గ్రామాలకు చెందిన పటేల్‌లు ఇతర గ్రామాలతో పాటు వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బేల : కాంగ్రెస్ ప్రభుత్వం దీపావళి సందర్భంగా దండారీ ఉత్సవాలకు రూ.15వేలు ఇవ్వడం స్వాగతిస్తామన్నారు. కానీ ఈ ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని, వాడగూడ, జంగుగూడ, మసాలా(బి), సదల్‌పూర్, గ్రామాలలో ఏర్పాటు చేసిన దీపావళి దండారీ ఉత్సవాలలో పాల్గొనగా గ్రామస్తులు ఘన స్వాగతం పలుకుతూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వంలో జోడేఘాట్ వద్ద ప్రతి ఆదివాసీ బిడ్డకు నివాళు లర్పించేలా సకల సౌకర్యాలు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. ప్రతి ఆదివాసీకి పట్టాలతో పాటు రైతుబంధు, రైతుబీమా అందించిందన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలు హామీలతో పథకాలతో చిచ్చుపెట్టే కార్యక్రమానికి పాల్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ అధ్యక్షులు కళ్లెం ప్రమోద్‌రెడ్డి, సతీష్ పవార్, మెంతెం దత్తు, తన్వీర్, విపిన్ పాల్గొన్నారు.

దండారీలకు చెక్కులు పంపిణీ...

ఆదివాసుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దండారీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన ఆయా గ్రామాలకు చెందిన దండారీ బృందాలకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పటేల్‌లు, కాంగ్రెస్, బీజేపీ, నాయకులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీలో ఫ్లెక్సీ రగడ...

మండల కేంద్రంలో గిరిజనులు అత్యంత వైభవంగా జరుపుకునే దండారీ ఉత్సవాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్క దండారీకి రూ.15వేల చొప్పున చెక్కులను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కనీసం సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి బ్యానర్ లేకుండనే చెక్కుల పంపిణీ చేయడం పట్ల కాంగ్రెస్ మండల నాయకులు అధికారులను నిలదీశారు. దీంతో ఐటీడీఏ అధికారి చెక్కులు పంపిణీ చేయడానికి ప్రభుత్వ బ్యానర్ అవసరం లేదని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఫైజుల్లా ఖాన్ మాట్లాడుతూ దండారీ ఉత్సవాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేల చెక్కులను గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 34 చెక్కులను పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి ఫోటోలు, బ్యానర్లు లేకుండా చెక్కులు ఎలా పంపిణీ చేస్తారని అన్నారు.

నార్నూర్ : ఉమ్మడి మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ప్రజలు శుక్రవారం దీపావళి పండగను ఘనంగా నిర్వహించారు. ఇండ్లను, దుకాణాలను విద్యుత్ దీపాలతో, పూలతో అలంకరించారు. ఇండ్లలో, దుకాణాలలో లక్ష్మీదేవికి పూజలు చేసి, నైవేద్యం సమర్పించి, మహిళలు వ్యాపార యజమానులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మెన్ మెస్రం రూపదేవ్ పటేల్, మాజీ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, మెస్రం మోతీరాం పటేల్, మెస్రం సీతారాం, కొట్నాక్ పవన్ కుమార్, కొట్నాక్ నానాజీ, మెస్రం భీంరావ్, జుగ్నక్ భీంరావ్, ఆత్రం రమేష్, రాయి సిడం రూపదేవ్, కుమురం నాగోరావ్, మెస్రం మోతీరాం, కుమురం సీతారామ్ ఉన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. గురువారం రూరల్ మండలంలోని చించుఘాట్‌లో ఏర్పాటు చేసిన దండారీ ఉత్సవాల్లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆదివాసులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దండారీ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల పటేల్‌లు బీజేపీ నాయకులు సంతోష్, దయాకర్, ఆదినాథ్, మహేష్, మయూర్ చంద్ర, నాగోరావ్, ముకుందరావు పాల్గొన్నారు.

కళ తప్పుతున్న పండుగలు...

60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు కుమురంభీమ్ విగ్రహాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురవారం మండలంలోని అంకాపూర్, చిన్నమాలే బోరిగాం గ్రామాల్లో ఏర్పాటు చేసిన దండారీ ఉత్సవాల కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారితో కలిసి గుస్సాడీ ఆడారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మెట్టు ప్రహ్లద్, ఉపాధ్యక్షులు ఇజ్జగిరి నారాయణ, మాజీ ఎంపీపీ గంద్రత్ రమేష్, కుమ్ర రాజు, పరమేశ్వర్, అప్కామ్ గంగయ్య, వెంకటేష్, బట్టు సతీష్, కే.విఠల్, దేవన్న, గెడం రాము, మర్సకోల పవన్ పాల్గొన్నారు.

దుస్తువులు పంపిణీ...

ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో జరుగుతున్న దండారీ ఉత్సవాలకు కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఆదివాసులు తమ డబ్బు చప్పులతో వారి సాంప్రదాయ నృత్యలతో కంది శ్రీనివాస్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారందరినీ కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అలిశెట్టి నాగన్న, భీమ్‌రావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌టౌన్ : మానవాలికి జీవనాధారమైన ప్రకృతిని కొలవడమే దండారీ పండుగ అని నిర్మల్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు అన్నారు. శుక్రవారం మండలంలోని గంగాయి పేట గ్రామంలో దండారీ ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి గోవు పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జుగ్నాక్ లక్ష్మణ్, ఆత్రం సంతోష్, పంద్రారం లక్ష్మణ్, దుర్వా లక్ష్మణ్, పంద్రం భారత, కుడుమేత సావిత్రిభాయి, ధ్రువ లక్ష్మీ, మడావి సరస్వతి, ఆత్రం జై పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌టౌన్ :

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే పాయల శంకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఆఫీస్‌లో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య లక్ష్మీ పూజ నిర్వహించారు. అందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యాలయ ఆవరణలో కుటుంబ సభ్యులతో బాణసంచా కాల్చి పండగ సంబరాలు జరుపుకున్నారు.

ప్రజాసేవ భవనంలో...

అలాగే పట్టణంలోని ప్రజాసేవ భవనంలో అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పండుగ వేడుకలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం టపాసులు కాలుస్తూ సందడి చేశారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో...

అలాగే పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి జోగు రామన్న బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి దీపావళి, లక్ష్మీపూజ నిర్వహించారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే జోగు రామన్న నివాసంలో కుటుంబ సమేతంగా పండును నిర్వహించుకున్నారు.

తాంసి : ఆదిలాబాద్ దండారీ ఉత్సవాలకు దేశంలో గుర్తింపు రావడంతో ప్రభుత్వం ప్రోత్సహకాలను అందించడం సంతోషించ దగ్గ విషయమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన ఆదివాసీ గిరిజన దండారీ ఉత్సవాలకు తాంసి మండల కేంద్రంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డితో కలిసి 47 దండారీ ఉత్సవ కమిటీలకు రూ.15 వేల చొప్పున పటేళ్లకు చెక్కులను అందజేశారు. అనంతరం ఇచ్చిన మాట ప్రకారం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి కోసం బోర్ వేయించగా హాస్టల్ వార్డెన్ హరీష్, ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీంపూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్, నాయకులు సంతోష్, శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్ మండలాల నాయకులు కృష్ణ, రామన్న యాదవ్, అశోక్ యాదవ్, అన్ను పటేల్, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్, వినోద్ రెడ్డి, రమణ, రఘు, యశ్వంత్, అఫ్రోజ్, లింబాజీ, భరత్, రజిని, అయా మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ, గిరిజనులు పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం దీపావళి పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వ్యాపార సముదాయాల్లో వ్యాపారస్తులు మహాలక్ష్మీపూజలు చేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా టపాకాయలు కాల్చుతూ వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు.



ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ రూరల్



సిరికొండ

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



సిరికొండ

నవతెలంగాణ-తాంసి

గ్రామాల్లోని చేపట్టే ఇంటింటి సర్వేను పగడ్బందీగా చేసే విధంగా సిబ్బందికి సూచించామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని సరిహద్దు మారుమూల తాంసి(కె) గ్రామంలో నిర్వహిస్తున్న కుటుంబ నమోదు ప్రాథమిక సర్వేలో కలెక్టర్ పాల్గొని పరిశీలించారు. అధికారులు ఎన్యూమరేటర్లు సిబ్బందితో సర్వే పరిశీలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఎన్యుమరేటర్లకు పక్కాగా శిక్షణ ఇచ్చామని మూడు రోజులపాటు సిబ్బంది ఆయా గ్రామ పంచాయతీలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రాథమికంగా ఇంటి గోడలపై స్టిక్కర్లు వేస్తారు. ఇంటి నెంబర్ కుటుంబ యజమాని పేరు క్రమ సంఖ్య అందులో పేర్కొంటారు. ఈనెల 6 నుంచి సమగ్ర కుటుంబ సర్వే చేపడుతారని, సర్వేలో అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సర్వేలో ఒక్క ఇల్లు కూడా తప్పిపోవద్దన్నారు. కాగా తాంసి(కె) గ్రామంలో 290 కుటుంబాలకు కార్యదర్శి, ఎఫ్ఏలు సర్వేలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ గోపాలకృష్ణ, ప్రత్యేక అధికారి హరిదాస్, ఆర్ఐ రామ్‌దాస్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

సిరికొండ : ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి డీఎల్పీఓ ఫణిందర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. షెడ్యూల్ కులాలు తెగలు, ఇతర బలహీన వర్గాల, తదితర అంశాలతో కూడిన సర్వే చేపడుతున్నట్టు తెలిపారు. నవంబర్ మూడు వరకు ఇండ్ల సంబంధిత సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని, మూడు నుంచి ఐదు వరకు గుర్తించిన ఇండ్లకు స్టిక్కర్లు అంటించాలని అన్నారు. 6 నుంచి 18 వరకు పూర్తి సమాచారాన్ని సేకరించాలని, 19 నుంచి 27 వరకు సేకరించిన వివరాలను నమోదు చేయాలన్నారు. 27 నుంచి 29 వరకు వివరాలను పున్హ పరిశీలించి 30న నివేదిక సమర్పించాలని తెలిపారు. వివరాలను పూర్తి సమాచారంతో పొందు పర్చాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, ఎంపీఓ సంతోష్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్ పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సమగ్ర ఇంటింటి సర్వేలో జిల్లా బీసీ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని, పూర్తి వివరాలు అందించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు డా.ఉప్పు కృష్ణంరాజు, అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా బీసీ ప్రజలకు 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెరిగితే బీసీ కుటుంబాల ప్రజలకు సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో ముందుకు సాగే అవకాశం ఉంటుందని తెలిపారు.

గ్రామంలో హైమస్ట్ లైట్ల ఏర్పాటు



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని దంసా తండాలో సరియైన వీధి దీపాలు లేకపోవడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ గ్రామానికి 02 హైమస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు ఆడే గజేందర్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం తమ గ్రామాన్ని పట్టించుకున్న దాఖలలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఆడే జనార్దన్, యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు మధుకర్, రామ్ లఖన్, కుంట శంకర్, పూజారి లింగు పటేల్, గ్రామస్తులు ఉన్నారు.

నూతన ఎంపీడీఓగా శంకర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-సిరికొండ



మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నూతన ఎంపీడీఓగా శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిబ్బంది శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. మండల అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని, నూతన ఎంపీడీఓ శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సంతోష్, ఏపీఓ భీంరావ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

చైర్మన్‌ను కలిసిన నూతన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



ఇటీవల నూతనంగా నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎండీ ఖమర్ అహ్మద్ శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయంలోని చైర్మెన్ ఛాంబర్‌లో మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను అందచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలో పార్క్ ఆవరణలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం పరిశీలించారు. మార్నింగ్ వాక్ కోసం పార్క్‌కు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. వాకింగ్ ట్రాక్ ఇరువైపుల పాడై పోయిన విద్యుత్ దీపాల స్థానంలో కొత్త వాటిని అమర్చాలని సూచించారు.

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయమని, రాష్ట్ర ప్రభుత్వం వారి ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం కోసం గాంధీ కుటుంబం అనేక త్యాగాలు చేసిందని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ హయాంలో దేశంలో మంచి పాలన కొనసాగిందన్నారు. దేశంలో అలుముకున్న చీకట్లను తొలగించడానికి ఇందిరాగాంధీ మనవడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, న్యాయ యాత్ర చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగ మూర్తి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గరీబ్ హటావో నినాదంతో దేశంలోని పేదల ఆకలి తీర్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళ్లు అర్పించారు. దేశానికి ఆమె అందించిన సేవలను స్మరించుకున్నారు. దేశ పౌరుల మధ్య ఐక్యత, సమగ్రత కోసం ఎనలేని కృషి చేశారన్నారు. తన హయాంలో ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని ఉక్కు మహిళగా కీర్తించ బడ్డారన్నారు. మహిళలు తమ తమ రంగాల్లో రాణించడానికి ఇందిరా గాంధీ ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, ఎంఎ షకీల్, పోరెడ్డి కిషన్, అశోక్, సుధాకర్‌గౌడ్, ఎంఎ ఖయ్యూం, భోజారెడ్డి, శ్రావణ్ నాయక్, రాంరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

కడెం : ఇందిరా గాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ మండలాధ్యక్షులు మల్లేష్ యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, సింగల్ విండో డైరెక్టర్‌లు గొల్ల వెంకటేష్, పడిగెల భూషణ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రమేష్ వర్మ, కడెం పట్టణాధ్యక్షులు వాజీద్‌ఖాన్, ఖానాపూర్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకాల శ్రీనివాస్, మండల మైనార్టీ అధ్యక్షులు బబ్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, కడెం మాజీ సర్పంచ్ అనూష లక్ష్మణ్, కాసుల భూమన్న, రాజేశ్వర్, ముస్కు రాజు, ధర్మయ్య, జక్కుల వెంకటి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | నవంబర్ 02, 2024 | www.navatelangana.com

డీఎస్పీ సత్యనారాయణకు కేంద్ర ప్రభుత్వ అవార్డు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



2019 నవంబర్‌లో సంచలనం సృష్టించిన సమత అత్యాచారం హత్య కేసు చేదించడంలో నిందితులకు శిక్ష పడేలా చేయడంలో ప్రముఖ పాత్ర వహించిన అప్పటి డీఎస్పీ సత్యనారాయణకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ "కేంద్రీయ గృహ మంత్రి దక్షిత పడక్" అవార్డుకు ఎంపిక చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. దేశవ్యాప్తంగా సాధారణ పోలీసుల విభాగంలో వివిధ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చేసిన 107 మంది అవార్డుకు ఎంపిక కాగా ఫోరెన్సిస్ విభాగంలో 8 మంది ఎంపికయ్యారు. గతంలో జిల్లాలో పనిచేసిన డీఎస్పీ ఎంపిక కావడం పట్ల జిల్లా ప్రజలతో పాటు పోలీసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం ప్రస్తుతం వరంగల్‌లో ఇంటలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న డీఎస్పీ సత్యనారాయణను సంప్రదించగా పనికి తగిన గుర్తింపు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని గుంట్లపెట్ గ్రామంలో యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేత, రన్నర్ ఆఫ్ జట్లకు ఎస్సై కొమురయ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లేండ్‌గూరే శ్యామ్‌రావు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి రూ.20000, రెండవ బహుమతి రూ.10000 అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిట్టి శ్రీనివాస్, మోహిన్, నక్క మనోహర్, నరేందర్, మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి, నాయకులు బండి శేఖర్, ముత్తినేని తిరుపతి, డెబ్బటి మహేష్, బండి మహేష్, బండి ప్రభాకర్, చిలువేరు భాస్కర్, బండి భీమయ్య, గిరుగుల చిన్నయ్య, దేవాజీ, పొట్టే సత్యనారాయణ, గ్రామ యువకులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా డ్రైనేజీ కాలువ నిర్మాణం

- అనారోగ్యం పాలవుతున్న గోలేటి ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-రెబ్బెన

ఆధాయ వనరులు లేక అనేక గ్రామపంచాయతీలు ఇబ్బందులు ఎదురవుతుంటే గోలేటి గ్రామపంచాయతీలో మాత్రం పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. మండల కేంద్రంలోని గోలేటి గ్రామపంచాయతీకి అనేక నిధులున్న కొట్టుమిట్టాలాడుతుంది. ఇటు ప్రభుత్వం నుండి అనేక నిధులున్న మాత్రం అభివృద్ధి శూన్యం. అటు సింగరేణి గ్రామాలను అభివృద్ధి చేయటంలో విఫలమవుతున్నారు. గోలేటి విలేజ్ బస్టాండ్ సమీపంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టి గాలికి వదిలేశారు. సింగరేణి కాలనీలో మురుగు నీరు, దుబ్బగూడం, భగత్‌సింగ్ నగర్ మురుగు కాలువల నీరు బస్టాండ్ సమీపంలో వచ్చి చేరుతోంది. దీంతో దుర్గంధం వెదజల్లి ప్రజలు అనారోగ్యానికి గువుతున్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ కాలువ నిర్మాణం చేపట్టి డ్రైనేజీ మురుగు నీరు నిలువ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

యువత నిరుద్యోగ సమస్యలపై పోరాటమే లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత నిరుద్యోగ సమస్యలపై నిరంతర పోరాటమే తమ లక్ష్యమని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయ ఆవరణలో నిర్వహించిన డీవైఎఫ్ఐ 44వ దినోత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవైఎఫ్ఐ 1980 నవంబర్ 1, 2, 3 మొదటి జాతీయ మహాసభలు పంజాబ్ రాష్ట్రం లూథియాన నగరంలో జరిగాయని ఆ మహాసభల్లో సంఘం ఆవిర్భవించిందన్నారు. పోరాటం, త్యాగం, పురోవృద్ధి అనే లక్ష్యంతో విద్య, ఉపాధి, ఉద్యోగం ప్రభుత్వాలు కల్పించాలని ప్రభుత్వాలతో పోరాటాలు చేస్తుందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం బీజేపీ మతోన్మాదం పేరుతో యువతను మత్తులో దింపి యువతకు ఇచ్చిన హామీలను మర్చిపోయిందన్నారు. ఉద్యోగం, ఉపాధి కల్పించకుండా చేతులెత్తేసిందన్నారు. ప్రభుత్వ రంగాల్లో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్న భర్తీ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కోరంగ మాలశ్రీ, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, చాపిడి శ్రావణి, జిల్లా సహా కార్యదర్శి ఆత్మకూరు సతీష్, జిల్లా కో కన్వీనర్ చిట్టి పాల్గొన్నారు.

యువత క్రీడ రంగాల్లో ముందుండాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థులకు విద్య ఎంత అవసరమో క్రీడలు కూడా అంతే అవసరమని, క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గం నాయకులు సంయుక్తంగా సిర్పూర్ యూత్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యామ్ రావ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రీడలలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు షైక్ చాన్, మొయిన్, నక్క మనోహర్, లలిత, కాశిపాక రాజు, మండల కో కన్వీనర్ పనస లక్ష్మణ్, పట్టణ అధ్యక్షులు ఎలములే నందజీ, మండల యూత్ ఉపాధ్యక్షులు గాడేం వినోద్, షారుక్, మొహమ్మద్ రఫీక్, ఇలియాజ్, హలీం, మండల కన్వీనర్ అస్లం బిన్ అబ్దుల్లా పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ అధ్యక్షుడిని కలిసిన ఓదెలు

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డిని ఆయన నివాసంలో గోదావరిఖనిలో బెల్లంపల్లి ఏరియా తెలంగాణ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు అంబాల ఓదెలు కలిశారు. తనను బెల్లంపల్లి ఏరియా కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా నియమించినందుకు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అంబాల ఓదెలుకు మిర్యాల రాజిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు చేసినట్టుగానే కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం కూడా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కృషి చేస్తుందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో వారికి కూడా సంక్షేమ కార్యక్రమాలు, వేతనాల పెంపు లాంటి హక్కులు అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మూడు సెల్ ఫోన్ల అప్పగింత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూలై, అక్టోబర్ నెలలో పోగొట్టుకున్న మూడు సెల్ ఫోన్‌లను సీఐ బుద్దె రవీందర్ బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. వెంటనే మొబైల్‌లను గుర్తించి అప్పగించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బాధితులు చంద్రశేఖర్, మీర్జా ఎజాజ్ బేగ్ పాల్గొన్నారు.

290 కేజీల గంజాయి పట్టివేత

- కంటైనర్, సెల్‌ఫోన్ స్వాధీనం, వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ డీవీ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమండ్రి నుండి మధ్యప్రదేశ్‌కు తరలిస్తున్న 290 కిలోల గంజాయిని పట్టుకున్నామన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అంతర్రాష్ట్ర సరిహద్దు వాంకిడి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఆసిఫాబాద్ వైపు నుండి మహారాష్ట్ర వైపుకు వెళ్తున్న కంటైనర్ లారీ (నెంబర్ ఎంపీ 06 హెచ్‌సీ 1339) డ్రైవర్ అనుమానస్పదంగా కనిపించడంతో విచారించి, కంటైనర్‌ను తనిఖీ చేశారు. ఇందులో భారీ మొత్తంలో గంజాయి లభించింది. లారీ కంటైనర్ డ్రైవర్ అసై రోడ్డు, మొరైనా, మధ్యప్రదేశ్‌కు చెందిన బల్వీర్‌సింగ్‌గా గుర్తించామని, డ్రైవర్‌ను వివరాలు అడుగగా మహారాష్ట్రకు చెందిన అరబింద్ అనే వ్యక్తి తనను గంజాయి సరఫరా కోసం రాజమండ్రికి పంపాడని, గంజాయిని అక్కడ లోడ్ చేసుకొని తిరిగి వస్తున్న క్రమంలో వాంకిడిలో పట్టుబడినట్టు తెలిపారు. ఒక్కొక్కటి గంజాయి ప్యాకెట్టు సుమారు రెండు కిలోల చొప్పున ఉంటుందని, మొత్తం 290 కిలోల బరువు ఉంటుందన్నారు. దీని విలువ సుమారు రూ.72.50 లక్షలు ఉంటుందని తెలిపారు. అలాగే కంటైనర్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని, గంజాయి తరలిస్తున్న లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. గంజాయి సరఫరాలో ముఖ్యమైన నిందితుడు అరబింద్‌ను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని మధ్యప్రదేశ్‌కు పంపినట్టు పేర్కొన్నారు. గంజాయి తరలిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, వాంకిడి సీఐ సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణాప్రతాప్, ఆసిఫాబాద్ సీఐ రవీందర్, ఎస్ఐ ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు

- నిర్మాణం పూర్తై నెలలు.. ఇంకా ప్రారంభానికి నోచుకొని పల్లె దవఖానాలు
- పట్టించుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-కౌటాల

గ్రామాల్లో వైద్య సేవలు విస్తరించేలా, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రభుత్వం నిర్మించింది. దీంతో పాటే రూ.లక్షలు ఖర్చు చేసి పల్లె దవాఖానాలను నిర్మించినా వాటిని ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రభుత్వ పట్టింపులేమి.. పాలకుల ఆలసత్వం కారణంగా గ్రామీణ పేదలకు సత్వర వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. అందమైన భవనాలు నిర్మించి ఏండ్లు గడుస్తున్నా వాటిని ప్రారంభించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. ఫలితంగా నిర్మించిన చోటనే శిథిలావస్థకు చేరుకునే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలో నూతనంగా నిర్మించిన పల్లె దవఖానాల దుస్థితిపై ప్రత్యేక కథనం. మండల కేంద్రంలోని పల్లె దవాఖాన, మొగడ్‌దగడ్ గ్రామంలోని పల్లె దవాఖానాలను గత ప్రభుత్వం నిర్మించింది. సంవత్సరాలు గడిచినా ప్రారంభం కాకపోవడంతో తాళం వేసే ఉంటున్నాయి. వారానికి ఒకటి రెండు సార్లు ఏఎస్ఎం వస్తుపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. పల్లె ప్రజలకు సాధారణ చికిత్సలు స్థానికంగానే అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలను మారుమూల గ్రామాల్లో ఏర్పాటు చేసింది. వైద్యం అందించేందుకు మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (డాక్టర్) ఏర్పాటు చేసింది. కానీ స్థానికంగా డాక్టర్ ఉండక పోవడంతో పల్లె దవాఖానకు తాళం వేసే ఉంటోంది. ఇటీవలే బెజ్జూరు మండల ఎల్కపల్లి(బి) గ్రామానికి చెందినా అంజన్న (17) అనే యువకుడు తీవ్ర జ్వరంతో సరైన సమయంలో వైద్యం అందక మరణించిన విషయం తెలిసిందే. అయిన అధికారులు పట్టించుకోవడంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వైద్యులను నియమించి పూర్తి స్థాయి వైద్య సేవలు, భవనాలు వినియోగంలోకి వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్న రోగులు

పల్లె దవాఖానలో సాధారణ చికిత్సకు కూడా నోచుకోకపోవడంతో గత్యంతరం లేక పల్లె ప్రజలు ఆర్‌ఎంపీలనే ఆశ్రయిస్తున్నారు. వైద్యం పేరుతో ఆర్‌ఎంపీలు అడ్డగోలు దోపిడీకి ఎగబడుతున్నారు. సాధారణ రోగాలనే పెద్దగా చూపుతూ దోపిడీ దందాకు పాల్పడుతున్నారని ఆరోపణలున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా దోమల ద్వారా విష జ్వరాలు ప్రబలుతుండటంతో పల్లె దవాఖానాలో డాక్టర్లు లేక పోవడంతో ఆర్‌ఎంపీలతో పాటు ప్రయివేట్ దవఖానాలకు ఆశ్రయించి జెబులను గుల్ల చేసుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని మండల వాసులు విన్నవిస్తున్నారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఇతర అన్ని అంశాలపై ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం మండలంలోని అడ గ్రామపంచాయతీ, ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్‌వాడి ఏరియాలలో కొనసాగుతున్న ఇండ్ల గుర్తింపు సర్వే ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను జిల్లాలో అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో సర్వే ప్రక్రియకు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందని, ప్రతి ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికెళ్లి కుటుంబ సభ్యుల వ్యక్తిగత, కుటుంబ వివరాలు సేకరించాలని తెలిపారు. కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్ క్రింద నిర్ణయించిన కుటుంబాల వివరాలు నమోదు చేయాలని, ఎన్యుమరేటర్ సేకరించిన వివరాలలో 10 శాతం రాండమ్ కుటుంబాలను ఎంపిక చేసుకొని ఆ ఇండ్లను సూపర్‌వైజర్ సందర్శించి వివరాలను పున:పరిశీలించాలని తెలిపారు. వివరాల సేకరణలో గోప్యత, నైతిక ప్రమాణాలు పాటించాలని, కేటాయించిన బ్లాక్‌లో అన్ని కుటుంబాలను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్పష్టమైన వివరాలు నమోదు చేయాలి

కెరమెరి : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని, స్పష్టమైన వివరాలు నమోదు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కెరమెరి గ్రామపంచాయతీని సందర్శించి, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా చేపట్టిన ఇండ్ల జాబితా రూపకల్పన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను జిల్లాలో ఎలాంటి పొరపట్లకు అస్కారం లేకుండా చూడాలన్నారు. ఈ ప్రక్రియను తహసీల్దార్లు, ఎంపీడీఓలు సూపర్‌వైజర్లతో కలిసి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్యుమరేటర్లకు ఇంటికి వచ్చిన సమయంలో ప్రజలు వారికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజాద్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, పంచాయతీ కార్యదర్శి గణేష్, గడ్డల వెంకటేశం పాల్గొన్నారు.

కొనసాగుతున్న దండారి సంబరాలు

నవతెలంగాణ-కెరమెరి

మండలంలో దండారి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివాసులు అత్యంత వైభవంగా భక్తి శ్రద్దాలతో జరుపుకునే దండారి సంబరాలు మండలంలోని చిన్న సాకడ గ్రామంలో వైభవంగా జరుపుకుంటున్నారు. శుక్రవారం గ్రామంలోని దండారి బృందం ప్రతి ఇంటింటికెళ్లి హారతిలు సేకరించారు. గ్రామస్తుల సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏత్మసూర్ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనందరావు నివాసంలో దండారి





బృందానికి అథిత్యం ఇచ్చి అన్నదానం ఏర్పాటు చేశారు. తదనంతరం గుస్సాడీ, కోలాటం నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని వాటిని భవితరాలకు అందించాలన్నారు. అనావాయితీని కొనసాగిస్తు ముందు తరాల వారికి అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, గ్రామ పటేల్ పెందోర్ దంభిరావు, మాజీ సర్పంచ్ జలపతిరావు, పెందోర్ శ్రీనివాస్, సేడ్మకి తుకారాం, దండారి యజమాని ఇశ్ర, సోము ఉన్నారు.

పీహెచ్‌సీ సందర్శించిన అనదపు కలెక్టర్



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థినులు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకొని శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆశ్రమ పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని మెడికల్ ఆఫీసర్ వినయ్ ఉప్రేను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో విద్యార్థినులకు వైద్యం అందించాలన్నారు. మందుల కొరత లేకుండా చూడాలని మేడికల్ ఆఫీసర్‌కు ఆదేశించారు. విద్యార్థినులకు ప్రతి రోజు నాణ్యమైన భోజనం, తాగునీరు అందించాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ వి.ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ ఎండీ రియాజ్ అలీ, ఎంపీఓ కాజా అజజొద్దిన్, హాస్టల్ వార్డెన్, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పటేల్ సేవలు చిరస్మరణీయం

- ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారతదేశ ప్రథమ హోంశాఖ మంత్రి, ప్రథమ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ డీవీ.శ్రీనివాస రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీపీఓ కార్యాలయంలో వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ రక్షణ, సమగ్రత కోసం భారత ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ ఆదర్శప్రాయమన్నారు. వల్లభాయ్ పటేల్ ఎందరికో ఆదర్శమని వారి సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం ఐక్యత భావం పెంపొందించేలా ఎస్పీ పోలీస్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఆర్.ప్రభాకరరావు, ఆసిఫాబాద్ సీఐ బుద్దె రవీందర్, రిజర్వ్‌డ్ ఇన్స్‌పెక్టర్(అడ్మిన్) పెద్దన్న, రిజర్వ్‌డ్ ఇన్స్‌పెక్టర్ ఎంటీఓ అంజన్న, ఆర్ఎస్ఐలు కిరణ్, లవన్, సందీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌పై పూర్తి విచారణ చేయాలి



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం రాత్రి భోజనం చేసినంతరం ఫుడ్‌పాయిజన్ కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి విద్యార్థుల ఆరోగ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం అపరిశుభ్రంగా ఉండడం వల్లనే విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిందన్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరం ఉన్న పాఠశాలలోనే ఫుడ్ పాయిజన్ అయిందంటే మారుమూల పాఠశాలల సంగతి ఎలా ఉందోనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు చదువుతున్న పాఠశాలలను సందర్శించి అక్కడ విద్యార్థులతో బస చేయాలని ఆదేశించినా జిల్లాలో నామమాత్రంగానే కొనసాగుతుందని ఆరోపించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలనే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్‌పై పూర్తిస్థాయిలో ఐటీడీఏ పీఓ ఆధ్వర్యంలో కమిటీ వేసి విచారించాలని డిమాండ్ చేశారు. ఇందులో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి వడ్లూరి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షుడు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల చిన్నచూపు తగదు

జిల్లా అధికార యంత్రాంగం విద్యార్థుల పట్ల చిన్నచూపు చూపెడుతుందనీ డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు సతీష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మండలకేంద్రంలోని ఆశ్రమ గిరిజన పాఠశాలలో 30 మంది విద్యార్థులు అస్వ స్తకు గురైన విషయంపై జిల్లాలో ఉన్న ఎంపీడీఓ, పీఓ ఇప్పటివరకు స్పందించకపోవడం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లుగా కనబడుతుంది. ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, వార్డెన్ ఒకరే కావడంతో పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు అస్వ స్తకు గురించియ్యారని, జీసీసీ నుంచి సరుకులు నాసిరకమైనవి వస్తున్నాయని ఆరోపణలు విద్యార్థుల నుంచి వస్తున్నాయన్నారు. 30 మంది విద్యార్థులు పూర్తిగా అనారోగ్యంతో ఉండడం చాలా బాధాకరమని, వాంకిడి, ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది సరైన వైద్యం అందించక వారిని రెఫర్ చేసినట్లు హెచ్ఎం తెలిపారన్నారు. శుక్రవారం వాంకిడి ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి రావడంతో ఆయనకు ఈ విషయాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి, జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు సతీష్, జిల్లా కో కన్వీనర్ చిట్టి, మండల అధ్యక్ష, కార్యదర్శులు దుర్గం నిఖిల్, వడ్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

5న సమావేశం విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 5న హైదరాబాద్‌లోని హాప్సిగూడ సుప్రభాత్ హోటల్లో నిర్వహించే టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మోతే లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ మాదిగల భవిష్యత్తు నిర్ణయంపై నిర్వహించే కార్యకర్తల సమావేశానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. జిల్లా నుండి పెద్ద ఎత్తున మాదిగలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, మురళి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళా మృతి

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని దమ్మన్నపేట గిరిజన గ్రామానికి చెందిన గడ్డం నాగమ్మ(26) పిడుగు పాటుకు గురై బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు నాగమ్మ భర్త ప్రశాంత్‌తో కలిసి గ్రామ శివారులోని పంట పొలంలో పనిచేసుకుంటూ ఉన్నారు. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో నాగమ్మ పిడుగుపాటుకు గురై అపస్మాక స్థితిలోకి వెళ్ళింది. అప్రమత్తమైన భర్త వెంటనే గ్రామం వరకు ఆమెను భుజాలపై తీసుకువచ్చి అక్కడనుండి 108 అంబులెన్స్‌లో మెదరపేటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించేందుకు ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. భర్త ప్రశాంత్ పిర్యాదు మేరకు కేసు గురువారం కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మెస్ చార్జీల పెంపుపై సర్వత్రా హర్షం

నవతెలంగాణ-హాజీపూర్



తెలంగాణాలోని అన్ని గురుకులాలు, సంక్షేమ హాస్టల్ల విద్యార్థినీ, విద్యార్థులకు మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు మహాత్మా జ్యోతిబా గురుకుల పాఠశాల, కళాశాలల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం గుడిపెట్ ఎంజేపీలో విద్యార్థులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చాలా సంవత్సరాలుగా చాలీ చాలని మెస్ చార్జీలతో ప్రిన్సిపాల్స్, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు ఆ ఇబ్బందులు తొలగిపోవడమే కాక విద్యార్థినీ, విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం అందించడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు.

గ్రామాల్లో మొదలైన ఇంటింటి సర్వే

- మొదటి రోజు స్టిక్కర్లు అంటిస్తున్న ఎన్యూమరేటర్లు



నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే శుక్రవారం మండలంలో మొదలైంది. సర్వే మొదటి రోజు శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికి స్టికర్లు అంటిస్తున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే-2024 ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ నియమించినట్లు తెలిపారు. కుటుంబాల వివరాలతో కూడిన సర్వే రిపోర్టు కంప్యూటర్ ద్వార ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీపతి బాపు రావు, ఏపీఓ ఈజీఎస్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ మల్లేష్‌తో పాటు ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీలోగల గాంధీనగర్‌లో చేపట్టిన కుటుంబ సర్వే కార్యక్రమాన్ని డీఆర్‌డీఓ, మండల ప్రత్యేక అధికారి కిషన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఎనిమరేటర్‌కు 150 కుటుంబాలు సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ఆ కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాలను రికార్డులలో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాహుల్, ఏపీఓ రవీందర్, ఈసీ విలాస్, ఏపీఎం బుచ్చన్న పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలో సమగ్ర కుటుంబ సర్వేను శుక్రవారం అధికారులు ప్రారంభించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు హౌస్ హోల్డ్ స్టిక్కర్స్, ఇంటి జాబితా పత్రాలను అందించారు. సంబంధిత ప్రొఫార్మలో కుటుంబాల వివరాలు నమోదు చేయాలని, అట్టి వివరాలను, షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు ఎన్యుమరేటర్లకు గ్రామాల్లో వివరాలతో కూడిన స్టిక్కర్లను ఇళ్లలో అంటించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గంగారాం, ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని డీఆర్‌డీఓ, మండల ప్రత్యేక అధికారి కిషన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా విద్యార్థులకు తెలంగాణ సాంస్కృతిక సారది కళాకారులు, తమ ఆట పాటల ద్వారా అవగహన కల్పించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఫారం నెం.6 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని, ఓటరు కార్డులో ఏవైన సవరణలు ఉంటే, ఫారం నెం.8 ద్వారా మార్చుకోవాలని వివరించారు. అలాగే రానున్నా ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని కళాకారుల పాటలతో చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముత్యం సతీష్, జాబ్ డిస్ట్రిక్ మేనేజర్ రాంచందర్, కళాకారులు రమేష్ లావుడ్యా, మురళీ, లచ్చన్న, కృష్ణ, పోశం సల్లూరి కిష్టయ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆస్పత్రిపై వస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే ఆరా

నవతెలంగాణ-మంచిర్యాల

గత కొన్ని రోజులుగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిపై వస్తున్న ఆరోపణలపై స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆరా తీశారు. గురువారం ఆస్పత్రికి సంబంధించిన బిల్లులను పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు వైద్యం అందిస్తున్న తీరుపై వైద్యులతో మాట్లాడారు. గత కొన్ని రోజులుగా వస్తున్న ఆరోపణలు అన్ని అవాస్తవాలని ఎటువంటి అవకతవకలు జరుగలేదని అడిట్ జరుగుతుందని ఇంకా లెక్కలు తేలడానికి సమయం పడుతుందని తెలిపారు. పేదలకు వైద్యం అందించేందుకు ఇక్కడ సిబ్బంది కృషి చేస్తున్నారని అసత్య ఆరోపణలు మానుకోవాలని, ఎవరైనా నిజంగా అవినీతికి, అక్రమాలకు పాల్పడినట్టైతే నేనే స్వయంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ హరీష్‌చంద్రరెడ్డి, ఆర్ఎంఓ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్ర ప్రభుత్వం పేదింటి అడబిడ్డల పెండ్లిళ్లకు ఆర్థిక సాయం చేసేందుకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 18 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. పేద ప్రజల సంక్షేమానికి ప్రజాపాలన ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని అయన పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.



అకాల వర్షం.. అపార నష్టం..!

నవతెలంగాణ-దండేపల్లి

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో బుధవారం రాత్రి గురువారం ఉదయం కురిసిన అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మండల కేంద్రంతో పాటు తాళ్ల పేట, ముత్యంపేట, గూడెం, వెంకటాపూర్, అందుగుల పేట గ్రామాల శివారులోని పంటలు నేలకొరిగాయి. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి అజిత్ కుమార్ వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో కలిసి నష్టపోయిన పంటలను పరిశీలించారు. సుమారు 300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచన వేసినట్లు పేర్కొన్నారు. పంట నష్టం అంచనాను ఉన్నతాధికారులకు నివేదిస్తునట్టు తెలిపారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతులు మాట్లాడుతూ కష్టపడి పండించిన పంట మరో వారం రోజుల్లో కోత కోసే సమయంలో అకాల వర్షం తమను తీవ్రంగా నష్ట పరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపోయిన పంటను అంచన వేసి నష్టపరిహారం అందించాలని వేడుకున్నారు.

దెబ్బ తిన్న పంటల పరిశీలన

కాసిపేట : మండలంలో కురిసిన భారీ వర్షానికి పంటలు దెబ్బ తిని నష్టం వాటిల్లింది. దింతో మండలంలోని మల్కేపల్లి, దేవాపూర్, పెద్దనపల్లి గ్రామాల్లో వర్షానికి దెబ్బ తిన్న పంటలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు



కాసిపేటలో..



దండేపల్లిలో..

పరిశీలించారు. భారీ వర్షానికి దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం వరి గింజ పాలు పోసుకునే దశ నుంచి గింజ గట్టి పడే దశలో ఉండగా వర్షంతో వరి పంట నేలకొరిగింది. నేలకొరిగిన వరి పంట దుబ్బులను నిలబెట్టి కుచ్చులుగా కట్టుకోవాలని, ఇలా కుచ్చులుగా కట్టినట్లయితే నష్ట శాతాన్ని తగ్గించవచ్చని రైతులకి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రభాకర్, ఏఈఓలు దీప్తి, రమ్య, రైతులు పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలో శుక్రవారం ఉదయం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి పంట నష్టం జరిగింది. తొలకరిలో బోరుబావుల వద్ద వేసిన వరి పంట కోత దశలో నేలకొరిగింది. చేతికొచ్చిన పంట నేలకొరకడంతో రైతులు లబో దిబోమంటున్నారు. ఈదురు గాలులతో వర్షం భారీ వర్షం కురవడంతో పత్తి పంట నేలరాలింది. ఏరివేతకు వచ్చిన పంట నేలరాలడంతో పత్తి రైతులు ఆవేదన చెందుతున్నారు. టమాట, బెండ, గోబి పండించే కూరగాయల రైతుల నారుమడులు వర్షానికి చెల్లాచెదురయ్యాయి. అధిక ధరలు వెచ్చించి కూరగాయల విత్తనాలు నాటిన రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం వ్యవసాయ విస్తరణ అధికారి శంకర్ గోపాల్ నగర్‌కు చెందిన శ్రీనివాస్ 5 ఎకరాల వరి పంట నేలకొడకడంతో పంటను పరిశీలించారు. అకాల వర్షాలకు నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

నవతెలంగాణ-హాజీపూర్



గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం అని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. మండలంలోని పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ముల్కల్ల వాగొడ్డుపల్లి నుంచి ర్యాలీ ప్రాజెక్ట్ వెళ్లే రహదారిపై పంచాయతీ రాజ్ నిధులు రూ.2 కోట్లతో లోలెవల్ బిడ్జి, దొనబండ నుంచి పెద్దంపేట వెళ్లే రహదారిపై రూ.1.6 కోట్లతో హైలెవల్ బిడ్జి నిర్మాణం కొరకు బుద్దిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొండాపూర్ గ్రామంలో రూ.75 లక్షలతో హై లెవల్ బిడ్జి నిర్మాణాని శంకుస్థాపన చేశారు. పెద్దంపేటలో గ్లాపల్లి గ్రామ రైతులు కలెక్టర్‌ను వరి ధాన్యం ఆరబెట్టు కోవడానికి స్థలం లేదని గ్రామానికి అనుకోని అటవీ ప్రాంతం ఉందని అందులో ఖాళీ స్థలాన్ని వరి ధాన్యం ఆరబెట్టుకోవడానికి కేటాయించాలని కోరారు. కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వరి ధాన్యం ఆరబెట్టుకోవడానికి స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారు. పెద్దంపేట, గొల్లపల్లి గ్రామాల్లో మహిళలు డ్వాక్రా భవనాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యేకు మహిళలు వినతి పత్రాలు ఇచ్చారు. రాపల్లి గ్రామంలో ప్లాట్లు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని కాపాడాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో బీటీ రోడ్లుకు రూ.50 కోట్లు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు.

గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

దండేపల్లి : మండలంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని ముత్యంపేట్, చింతపల్లి, నర్సాపూర్, గూడెం గ్రామాలలో రూ.7 కోట్ల సిఆర్ఆర్ నిధులతో సీసీ రోడ్డు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధికార యంత్రాంగంతో పాటు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడం లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల కేంద్రానికి మంద కృష్ణ మాదిగ రాక



నవతెలంగాణ-జన్నారం

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిర్వహించే ధర్మ యుద్ధం సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రానున్నట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్ట్ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన వెంటనే నిండు అసెంబ్లీలో అన్ని రాష్ట్రాలకంటే తెలంగాణ రాష్ట్రంలో మొదటగా వర్గీకరణ అమలు చేస్తాం అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పి మాలల ఒత్తిడికి తలొగ్గి ఇప్పుడు వర్గీకరణ జాప్యం చేస్తూ ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడన్నారు. అందుకు గాను మాదిగ సమాజాన్ని తట్టి లేపడం కోసం ఉమ్మడి అదిలాబాద్ జిల్లా సదస్సును మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుంతుందని తెలిపారు. ఈ ధర్మ యుద్ధ సదస్సును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్, ప్రధానకార్యదర్శి జంగం రవి, ప్రచారకార్యదర్శి ముల్కాల రమేష్, సీనియర్ నాయకులు మామిడిపల్లి ఇందయ్య, దుమ్మల ఎల్లయ్య, శ్రీపల్లి అంజన్న, కొండుకూరి ప్రశాంత్, జిల్లా నాయకులు జిలకర శంకర్, తగరం సత్యం పాల్గొన్నారు.

గోదావరిలో మునిగిన ఇద్దరు విద్యార్థులు మృతి

నవతెలంగాణ-జైపూర్



చెన్నూర్ మండలం దుగ్నెపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు శుక్రవారం గోదావరి నది ప్రవాహంలో మునిగి మృతి చెందారు. దీపావళి పండుగ సంధర్భంగా స్నేహితులతో కలిసి గోదావరి నది స్నానానికి వెల్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అన్నారం బ్యారేజ్ నుంచి నీటి ప్రవాహం పెరుగడంతో వరద తీవ్రతకు నదిలో స్నానం చేస్తున్న దాసరి సాయి (16) కొండ అరుణ్ కుమార్(19) వరద ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన దాసరి సాయి కుటుంబం గోదావరి ఖనిలో ఉంటుండగా మృతుడు సాయి కరీంనగర్ ఎస్ఆర్ కాళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దుగ్నెపల్లిలో ఉంటున్న కొండ అరుణ్ కుమార్(19) కిష్టాపేట్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. విషయం తెల్సుకున్న చెన్నూర్ సీఐ రవిందర్, ఎస్సై సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను గోదావరి నది నుండి బయటకు తీయించాడు. కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

అచ్చు తప్పును సవరించి నేతకానిగా మార్చాలి

నవతెలంగాణ-జన్నారం

ఎస్సీ కేటగిరిలో 40 సీరియల్ నంబర్లో నేతకానికి బదులుగా నేతాని అని ఉన్న అచ్చుతప్పును సవరించి నేతకాని సమాజానికి విద్య ఉద్యోగ సామాజిక రాజకీయ రంగాల్లో న్యాయం చేయాలని నేతకాని సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయాల ద్వారా ఆన్‌లైన్ నుండి నేతకాని కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ గెజిట్‌లో ఉన్న అచ్చు తప్పును సవరించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అచ్చుతప్పును సవరించి నేతకానిగా మార్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన నిర్వహిస్తున్నందున నేతకాని కులస్తులకు విద్య ఉద్యోగ సామాజిక రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అనివార్యం అయినట్లైతే, నేతకాని జనాభా ప్రాతిపదికన దామాషా ప్రకారం, ఐదు శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎస్సీలో ఉన్న ప్రస్తుత రిజర్వేషన్లను 22 శాతానికి పెంచాలన్నారు. కార్యక్రమంలో నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాళ్లపల్లి రాజేశ్వర్, రాష్ట్ర సీనియర్ నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, రాష్ట్ర నాయకులు జాడి గంగాధర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడివెంకటయ్య, ప్రధాన కార్యదర్శి రత్నం మాణిక్యం, ఉపాధ్యక్షులు బండారి స్వామి, జునుగురి మల్లయ్య, ఐరగడ్డ ప్రేమ్ కుమార్ వెంబడి శేఖర్, బోర్లకుంట శ్రీనివాస్, బండారి శ్రీధర్, పెరుగు మహేందర్ పాల్గొన్నారు.

బీసీ వసితి గృహానికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం కేటాయిస్తాం

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని బీసీ వసతి గృహానికి కేటాయిస్తామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి స్థానికంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ భవనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పిస్తూ 30 పడకలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో 180 మంది విద్యార్థులకు వసతి కల్పించేందుకు త్వరలోనే ఏర్పాటు చేస్తామని అన్నారు. త్వరలోనే మండల కేంద్రంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం త్రిమూర్తి, పూర్ణచందర్ రావు, పింగళి రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

నవతెలంగాణ-నస్పూర్

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి తలారి రాజు, నాయకులు గరిగంటి రాజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని టీడీపీ కార్యాలయంలో నవంబర్ 3వ తేదీన ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్ కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సభ్యత నమోదు కార్యక్రమానికి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-తాండూర్

మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేయనున్న మహిళా క్యాంటీన్‌కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ ప్రవేశపెట్టిందని తెలిపారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దండారీలకు చెక్కుల అందజేత



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ఆదివాసీ దండారీలకు ప్రభుత్వం విడుదల చేసిన చెక్కులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ అందించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాసిపేటలోని 14 దండారీలకు ఒక్కో దండారీకి రూ.15000 చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీడీఓ మడావి గంగారాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఆదివాసీ సంఘాల నాయకులు ఆడె జంగు, సోయం సూరు, ఆత్రం జంగు, దండారీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు

నవతెలంగాణ-జైపూర్



జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆత్మహత్యకు యత్నించిన మహిళను బ్లూకోర్ట్ పోలీసులు కాపాడినట్లు స్థానిక ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఇందారం సమీపంలో గోదావరి నది ఏరియాలో గురువారం ఆత్మహత్యయత్నం చేస్తున్న మహిళను విధి నిర్వాహణలో ఉన్న బ్లూకోర్ట్ పోలీసులు గుర్తించి అడ్డుకున్నట్లు తెలిపారు. ఆత్మహత్యయత్నం చేసిన మహిళ మంచిర్యాల జిల్లా కేంద్రం గాయత్రిమాత కాలనీకి చెందిన ఎండీ షాలినిగా గుర్తించారు. పోలీసులు కిషోర్, లక్ష్మన్‌లు విధుల పట్ల అప్రమత్తంగా ఉండి మహిళ ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గుర్తించి అడ్డుకోవడంతో ఆమె ప్రాణాలను కాపాడగలిగారని ఆయన తెలిపారు.

బీజేపీ పార్టీలో చేరిన మాజీ జడ్పీటీసీ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట మాజీ జడ్పీటీసీ ముత్తె సతయ్య శుక్రవారం బీజేపీలో చేరారు. కరీంనగర్‌లో కేంద్రంలో హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు సమక్షంలో చేరారు. ప్రముఖులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మాట్లాడుతూ తనకున్న అనుభవంతో లక్షెట్టిపేట మండలం, పట్టణంలో పార్టీ బలోపేతానికి కృషిచేసి రాబోయే ఎన్నికల్లో సత్తా చాటేలా కృషి చేస్తామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | నవంబర్ 02, 2024 | www.navatelangana.com

కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షం

నవతెలంగాణ-బేల

ప్రభుత్వం గురుకులాల్లో విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడం హర్షణీయమని మహాత్మజ్యోతిభ పూలే గురుకులంలో ప్రిన్సిపాల్ రంగనాథ్ అన్నారు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం ఉతర్వులు జారీ చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. ఈ పెంచిన చార్జీలు నవంబర్ నుండి అమలు చేస్తూ ఉతర్వులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ప్రస్తుతం రూ. 950గా ఉన్న డైట్ చార్జీలను రూ. 1330కి పెంచారు. అలాగే 8 నుంచి 10వ తరగతి వరకు రూ.1100 నుంచి రూ. 1550కు, ఇంటర్ నుంచి పీజీ వరకు డైట్ చార్జీలను రూ. 1500 నుంచి రూ.2100కు పెంచారన్నారు. దీంతో పాటు కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచారని తెలిపారు. ఈ డైట్ చార్జీల పెంపుతో పిల్లలకు మరింతగా పోషకాలు అంది ఆరోగ్యానికి దోహదం చేస్తుందన్నారు.

కార్మిక ఉద్యమాలకు దిక్సూచి ఏఐటీయూసీ

నవతెలంగాణ-మంచిర్యాల

కార్మిక ఉద్యమాలకు దిక్సూచి ఏఐటీయూసీ అని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ముంబై మహానగరంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) స్థాపించబడిందని, అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ దేశ స్వాతంత్ర పోరాటంలోనూ అనేక సంస్థల్లో జరిగిన పోరాటంలోనూ కార్మిక లోకాన్ని ఏకం చేసి కదిలించిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. వందేళ్ళ సుదీర్ఘ పోరాటంలో శ్రామిక, కార్మిక వర్గానికి ఏఐటీయూసీ భరోసాగా నిలిచిందని కార్మికుల పక్షాన చేపట్టిన పోరాటాలతోనే అనేక హక్కులు సాధించుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఖలిందర్ అలీ ఖాన్, రామన్న, మహేష్, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాయమల్లు, మధు, నర్సయ్య, క్రాంతి, శంకరమ్మ, స్వరూప పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 79 శాతం బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలో 79శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అక్టోబర్ మాసానికి సంబంధించిన ఉత్పత్తి ఉత్పాదకత వివరాలను వెల్లడించారు. వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందన్నారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన బొగ్గు ఉత్పత్తి కంటే కొంత అక్టోబర్‌లో ఉత్పత్తి మెరుగ్గ ఉందన్నారు. 2.40 లక్షల టన్నులకు గాను 1.89 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. గోలేటి ఓసీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. త్వరలో ఫారెస్ట్ నుండి క్లియరెన్స్ వచ్చిన వెంటనే గోలేటి ఓసీని ప్రారంభిస్తామన్నారు. ఫారెస్ట్ భూమి 6.15 హెక్టార్ల అనుమతుల కోసం ముమ్మారం చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికుల శ్రేయస్సు కోసం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట మెప్మా ఆర్పీల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుటుంబ సర్వేలో కీలకంగా వ్యవహరించే తమకు గుర్తింపు ఇవ్వడం లేదని మెప్మా ఆర్పీలు మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగాఆర్పీ పద్మ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకంలో మెప్మా ఆర్పీలు కీలకంగా ఉంటారన్నారు. కానీ తమకు గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. వేతనాలతో పాటు గుర్తింపు, ఐడీ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు ఆర్పీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తాము ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న సరైన గుర్తింపు లేదన్నారు. దీనిపై స్పందించిన కమీషనర్ ఐడీ కార్డులు జారీ చేసే విధంగా కృషి చేస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించి సర్వేకు వెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు మాట్లాడుతూ సర్వేల్లో కీలంగా ఉన్న తమకు గుర్తింపు ఇవ్వాలని ఆర్పీలు విన్నవించారన్నారు. వారికి ఐడీ కార్డులతో పాటు ఇతర వసతులు కల్పించేల కృషి చేస్తామన్నారు. వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తన దృష్టికి తెచ్చారన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో వాటిని చెల్లించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా దీప్‌దాన్ ఉత్సవ్

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్‌లో గురువారం దీపావళి సందర్భంగా దీప్‌దాన్ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధవిహార్ ప్రాంగణంలో బుద్ధుడి ప్రతిమ ముందు వందలాది దీపాలను వెలిగించి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మహాప్రబ్ అశోక్ మహోల్కార్ పాల్గొని మాట్లాడారు. అశ్విన్ పౌర్ణమి ముగిసి అమావాస్య రోజు తన స్వంత రాజ్యం కపిలవస్తుకు 18 సంవత్సరాల తర్వాత తాను బుద్ధుడిగా మారి తిరిగి ఆగమనం చేశారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కపిలవస్తు రాజ్యంలోని ప్రజలందరూ దీప కాంతులతో బుద్ధుడికి స్వాగతం పలికారని, అందుకే దేశంలోని బౌద్ధులందరు ఈ రోజును ఘనంగా జరుపుకుంటారన్నారు. ముందుగా బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి బుద్ధ వందన సమర్పించారు. కార్యక్రమంలో మండల అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్‌కుమార్, బౌద్ధ సంఘం అధ్యక్షుడు కోబ్రాగడే విలాస్, మహాత్మా రాజేంద్ర ప్రసాద్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ఆర్గనైజర్ ఉప్రె విజయ్, ఉపాధ్యక్షుడు దుర్గం హంసరాజ్, సిద్ధార్థ యువజన సంఘం అధ్యక్షుడు కొయ్యాల మహేష్, నాయకులు సందీప్, ప్రతాప్, అరుణ్‌కుమార్, రోషన్, రమేష్, సంజీవ్, జైపాల్, విద్యాసాగర్, రమాబాయి, మహిళా మండలి సభ్యులు కమలాబాయి, మహిళలు పాల్గొన్నారు.

నీట్‌లో సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని బ్రాహమేశ్వర్ గ్రామానికి చెందిన జాదవ్ అనిత - ఇవారం దంపతుల కుమారుడు జాదవు కిరణ్ కుమార్ నీట్‌లో ఎంబీబీఎస్ హైదరాబాద్‌లో సీట్ సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం బ్రహ్మేశ్వర్‌ను గ్రామస్తులు కిరణ్ కుమార్‌కు శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శివరాం మాజీ సర్పంచ్ దత్తురం మాట్లాడుతూ మారుమూల గ్రామం నుంచి నిరుపేద కుటుంబం నుంచి వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. దీంతో గ్రామంలోని యువత కిరణ్ కుమారును ఆదర్శంగా తీసుకొని గ్రామంలో మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులున్నారు

చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిమ్స్‌లో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ తరపున భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు బండ అనిల్ కుమార్, ట్రస్ట్ కమిటీ మెంబర్స్ బండ సునీల్ కుమార్, కుర్ర నరేష్, అనుముల ఉదయ్ కిరణ్, సుమంత్ పాల్గొన్నారు.

దండారి ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని సింగపూర్ (గొండ్‌గూడ) గ్రామంలో దండారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న రూ.15 వేల చెక్కులను అందజేశారు. అనంతరం ఆదివాసీ సభ్యులతో కలసి సాంప్రదాయ వస్త్ర ధారణలో నృత్యాలు చేసిన ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, డీటీడబ్ల్యూ అంబాజీ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధోనికేని దయానంద్, జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, రాజుర మాజీ సర్పంచ్ చిన్నం రవి, పెండూర్ మాధవ్, పటేల్ అర్జున్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్, నాయకులు లక్ష్మీ పతిగౌడ్, యూసఫ్ ఖాన్, శేషాద్రి, బి.రాజేందర్, షౌకత్ పాషా, ఖాజా, సోమిరెడ్డి నారాయణ రెడ్డి, బిక్కు సింగ్, రాజేందర్, సంజీవ్, బిల్ల రవి, ఎంపీఓ రత్నాకర్, సూపరింటెండెంట్ స్వామి, ఆదివాసులు పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలోనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దండారి ఉత్సవాలలో భాగంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దండారి బృందాలకు చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 36 దండారీలకు రూ.15 వేల చెక్కులను అందించి సంస్కృతిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు నారాయణ్ రెడ్డి, ఎలక రాజు, బోడా లక్మన్, తహెర్ బిన్ సలాం, రుక్మన్ సింగ్, సురేందర్ యాదవ్, పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల మండలంలోని వాగాపూర్ గ్రామంలో గురువారం దండారి ఉత్సవాలో పాల్గొని ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలను అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముందుగా దండారి ఉత్సవాల్లో టోపీ పెట్టుకుని నృత్యాలు చేశారు. దండారి కళాకారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు, టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భూపెల్లి శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు, దండారి కళాకారులు పాల్గొన్నారు.

బేల : కాంగ్రెస్ ప్రభుత్వం దీపావళి దండారి ఉత్సవాలకు రూ.15వేలు ఇవ్వడం స్వాగతిస్తాం, కానీ ఈ ఘనత కేసిఆర్‌కి దక్కుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మండలంలోని వాడగూడ, జంగుగూడ, మసాలా-బి, సదల్పూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన దీపావళి దండారి ఉత్సవాల్లో ఆయన పాల్గొనగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

నేరడిగొండ : దీపావళి పండుగ సందర్భంగా గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ నివాసం వద్ద దండారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గుస్సాడి నృత్యాలలో ఎమ్మెల్యే పాల్గొన్న గుస్సాడి వేషధారణ ధరించి వారితో కలిసి నృత్యాలు చేశారు. అదే విధంగా మండలంలోని లఖంపూర్ గ్రామంలో దండారి ఉత్సవాల్లో ఎమ్మెల్యే అనిల్ జాధవ్ పాల్గొని బృందాలకు రూ.15 వేల చెక్కులను 11 దండారిలకు అందించారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.





పక్కా పరిశీలనతో హౌస్ లిస్టింగ్ చేయాలి

- సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇండ్ల గుర్తింపుకు సర్వే శుక్రవారం నుంచి ప్రారంభమైందని ఏ ఒక్క నివాస గృహం సైతం మినహాయించకుండా పక్కా పరిశీలనతో హౌస్ లిస్టింగ్ చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం పట్టణంలోని రీక్షాకాలనీ, శ్రీరాం కాలనిలో జరుగుతున్న ఇండ్ల గుర్తింపు సర్వేను అధికారులతో కలిసి పరిశీలించారు. నమోదు విధానం, వివరాల సేకరణ తదితర వాటి గురించి ఎన్యుమరేటర్ల నుంచి తెలుసుకున్నారు. యాజమనుల వివరాలను పక్కగా నమోదు చేయాలని సూచించారు. అవసరమున్న వారిని నియమించి శిక్షణాలు ఇవ్వాలని కమిషనర్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నవంబర్ 6 నుంచి కులగణనలో భాగంగా ఇంటింటి సర్వే చేపడుతుందన్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఇండ్ల గుర్తింపు సర్వే కొనసాగుతుందన్నారు. ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు వివరాలను అందించాలని ప్రజలను కోరారు. ఈ సర్వే ఆధారంగానే భవిష్యత్తులో రిజర్వేషన్లు, ఇతర ప్రభుత్వ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు.



ఎన్యుమరేటర్లు కూడా ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను సేకరించాలన్నారు. సూపర్వైజర్లతో పాటు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ వారిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా సర్వేను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఫైఎస్ఓ వేంకటేశ్వర్లు, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు ఉన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కెరమెరి

వాంకిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో భోజనం వికటించిన సంఘనటనలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడవి భరత్ భూషణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వాంకిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో భోజనం వికటించి సుమారు 30 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలయ్యారని తెలిపారు. వాంతులు, విరేచనాలతో విద్యార్థులు 2 రోజులుగా బాధపడుతున్నా వార్డెన్, ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోలేదని ఆరోపించారు. సంఘటన జరిగిన వెంటనే స్పందించి ఉంటే విద్యార్థులు పండగ పూట ఆస్పత్రిలో ఉండే వారు కాదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించని కారణంగానే అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. సంఘటకు కారకులైన వార్డెన్, హెచ్ఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనారోగ్యానికి గురైన బాలికలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమం ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు సెడ్మాకి తుకారం, నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌లకు అనుగుణంగా కార్మిక చట్టాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శతాబ్దకాలపు పోరాటాలు, ప్రాణత్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోది ప్రభుత్వం కార్పోరేట్లకు అనుకూలంగా కోడ్లుగా విభజించిందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం సీపీఐ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. సంఘం పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం కార్మిక ఉద్యమ వీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. 1920లో ఆవిర్భవించిన ఏఐటీయూసీ బ్రిటీష్ పాలనలోనే 37 కార్మిక చట్టాలను సాధించిందని సంఘం రాష్ట్ర కార్యదర్శి విలాస్ తెలిపారు. స్వాతంత్ర్యానంతరం మరో 10 చట్టాల సాధించుకోవడంలో కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. కార్మికులను సంఘటితం చేసి హక్కుల కోసం పోరాడే స్ఫూర్తిని కల్పించిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. 55 కోట్ల కార్మికుల పక్షాన ఏఐటీయూసీ జరిపిన పోరాటాలకు మహామహులు నేతృత్వం వహించారన్నారు. సుదీర్ఘ పోరాటాలు, ప్రాణత్యాగాల ఫలితంగా సాధించుకున్న 47 కార్మిక చట్టాలను మోది ప్రభుత్వం కార్పోరేట్ల కోసం 4 కోడ్లుగా విభజించి అమలు కోసం రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్మిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్, నాయకులు గజెంగుల రాజు, కుంటాల రాములు, కాంతారావు పాల్గొన్నారు.



సుంకిడి గ్రామంలో ఆటో, స్ప్రింక్లర్లు దొంగతనం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి గ్రామంలో వారం రోజుల క్రితం అంగన్‌వాడీ శోభ మెడలో నుండి రెండున్నర తులాల బంగారం చోరి కాగా ఆ సంఘటన మరవకముందే గురువారం రాత్రి ఆటోతో పాటు స్ప్రింకర్లు దొంగతనం జరిగినట్లు బాధితులు గ్రామస్తులు తెలిపారు. సుంకిడి గ్రామానికి చెందిన పూర్ణం శ్రీకాంత్ ఇంటి నుండి ఆటో (టీఎస్01 3518), అదే గ్రామానికి చెందిన రైతులు భీమనవేని ఆశన్న కుమ్మరి మహేందర్, ఇస్తారి రైతుల స్పింకులర్లు, మోటారు సర్వీస్ వైరు చెను నుంచి ఎత్తుకెళ్లారు. ఈ విషయమైన బాదితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2024-25 విద్యాసంవత్సరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీలో డిగ్రీలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15 వరకు గడువు ఉన్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, కళాశాల కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ లేదా తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా 2019-23 సంవత్సరాలలో అడ్మిషన్ తీసుకున్న ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజును ఈ నెల 15లోగా చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9494314314 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలి



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

కులగణన సర్వేల నుంచి అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఏపీడీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్కూల్ టీచర్స్‌కు ఈ సర్వేలు చేయాలని చెప్పారన్నారు. కానీ అధికారులు మాత్రం ఎందుకు అంగన్‌వాడీ టీచర్‌లకు సర్వే విధులు కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. సర్వే నుంచి వీరిని మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, జిల్లా సహాయ కార్యదర్శి గంగామణి, ప్రసాద, విజయ, సునీత, భూలక్ష్మి, అమూర్త, సరదా, పుష్ప, కవిత రత్నమాల, కమల, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బరుకుంట గంగారం పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ చోరీ

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని విద్యానగర్‌లో గురువారం ఇంటి ఎదురుగా నిలిచి ఉన్న ద్విచక్ర వాహనం చోరికి గురైంది. బాదుతుడు తెలిపిన వివరాల ప్రకారం.. కొక్కుల రాజలింగు తన ఇంటి ముందు బ్లూ కలర్ గ్లామర్ వాహనం(టీఎస్ 18 3203) పార్క్ చేశారు. కొద్దిసేపటి తర్వాత చూసేసరికి వాహనం కనిపించలేదు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు.

జిల్లాలో ఘనంగా దీపావళి వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దీపావళి పండుగ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. గురువారం భోగి పండుగ వేడుకల్లో భాగంగా ఉదయం తోబుట్టువులతో మంగళ హారతులు తీసుకొని కర్రలతో తయారుచేసిన కోల తిప్పుకున్నారు. సాయంత్రం వ్యాపారస్తులు లక్ష్మీ పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని వివిధ రకాల వస్తువులు కొనడానికి వివిధ మండలాల నుండి జిల్లా కేంద్రానికి వస్తున్న ప్రజలతో జిల్లా కేంద్రం కిక్కిరిసిపోయింది. శుక్రవారం కేదారేశ్వర వ్రతాలు నిర్వహించుకున్నారు. ప్రభుత్వం గురువారం ఒకేరోజు సెలవు ప్రకటించినప్పటికీ ప్రధాన పండుగ కావడంతో పాఠశాలలకు బుధవారం ఆప్షనల్ హాలిడేగా ప్రకటించిన అధికారులు శుక్రవారం స్థానిక సెలవుగా ప్రకటిస్తూ మూడు రోజులు సెలవులు ఇచ్చారు. అనేక హాస్టల్స్ దీపావళి పండుగతో పాటు గిరిజనుల సంస్కృతి సాంప్రదాయానికి ప్రతికైన దండారి ఉత్సవాల నేపథ్యంలో విద్యార్థులు ఇండ్లలోకి వెళ్లడంతో ఖాళీ అయ్యాయి.

కౌటాల : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం దీపావళి పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వ్యాపారస్తులు లక్ష్మీ పూజ చేసినంతరం బానసంచాలు పేల్చారు. శుక్రవారం దీపావళి నోముల వ్రతం చేశారు. ఈ పండుగ వేడుకల్లో చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ కలిసి దీపావళి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.

అటవీ అధికారులపై చర్యలు తీసుకోకుంటే నిరాహారదీక్ష

- పీసీసీఎఫ్‌కు తేల్చి చెప్పిన ఎమ్మెల్యే హరీష్‌బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇటీవల సిర్పూరు (టి) మండలానికి చెందిన ఏడుగురు వ్యక్తులను చితకబాదిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోని పక్షంలో తాను సోమవారం నుండి సిర్పూరు నియోజకవర్గ కేంద్రంలో దీక్ష చేపడతానని ఎమ్మెల్యే హరీష్‌బాబు స్పష్టం చేశారు. శుక్రవారం హైద్రాబాద్‌లో ఆయన పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్‌ను కలిసి అటవీ అధికారులపై ఫిర్యాదు చేశారు. అడవి పందిని చంపారనే అనుమానంతో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు వారిని కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయానికి తరలించి చితకబాదారని, ఈ ఘటనకు బాధ్యులైన సిర్పూరు రేంజ్ అధికారి ఇక్బాల్, రెబ్బెన సెక్షన్ అధికారి సద్దాంలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సోమవారం నుండి నియోజకవర్గ కేంద్రంలో రైతులతో కలిసి నిరాహారదీక్ష చేస్తానని హెచ్చరించారు. నియోజకవర్గంలో అటవీ అధికారులు అడ్డగోలు అవినీతి, అక్రమ సంపాదనకు మరిగి ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటానని పీసీసీఎఫ్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు.

అమరవీరుల స్మారక సభలను నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భూమికోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు విప్లవ జోహార్లు అర్పిస్తూ నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల స్మారక సభలను నిర్వహించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట నారాయణ కోరారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. దున్నేవాడికే భూమి నినాదంగా వ్యవసాయ విప్లవ పోరాటాలు సాగించాలని దేశ ప్రజానీకానికి భూమి, బుక్తి, విముక్తికి నూతన ప్రజాస్వామ్య విప్లవం మాత్రమే మార్గమని ఎలిగెత్తి చాటిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు సుభాష్, నర్సింగ్, దేవిదాస్, అఖిల్, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జుకు సన్మానం



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలకు 7 కొత్త టీచర్ పోస్టు మంజూరుకు కీలకంగా వ్యవహరించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును పాఠశాల తరపున సన్మానించారు. శుక్రవారం క్యాంప్ ఆఫీసులో శాలువతో సత్కరించి భవిష్యత్తులో ఇలానే విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పాఠశాల ప్రధానోపధ్యాయులు బోనగిరి నరేందర్ రావు, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య, షేక్ ఇమ్రాన్ ఉన్నారు.

మృతి చెందిన ఉపాధ్యాయుడికి నివాళి

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లక్కారంలో ఉధ్యాయుడు భూక్యా శంకర్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ దంపతులు వారి నివాసానికి వెళ్లి పార్థీవ దేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భూక్యా శంకర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు నవంబర్ 1 నుండి నవంబర్ 30 వరకు పోలీస్ యాక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పి డీవీ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు చెయొద్దన్నారు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు , కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, ప్రేలుడు పదార్థలు, నేరానికి పురిగోల్పే ఎటువంటి ఆయుదలు వాడరాదన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లు, జనసమూహం పోగు అవుట వంటివి నిషేధమన్నారు. జిల్లాలో 30 యాక్ట్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైన్స్ కళాశాలలో జాతీయ సమైక్యత దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ లో ఎన్సీసీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ 565 సంస్థానాలను దేశంలో విలీనం చేసి దేశాన్ని సమైక్యంగా నిలిపారని అన్నారు. అలాగే ఎన్ సి సి కేడెట్లతో కలిసి ఏకతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు అరుణ్ కుమార్, సంతోష్ కుమార్, చక్రవర్తి, రమాకాంత్ గౌడ్, శ్రీధరాదేవి, మంజుల, జోత్స్న, పాల్గొన్నారు.

దీపావళి వేళ రోకడ్ ఖాతాలు ప్రారంభం



నవతెలంగాణ-భైంసా

జిన్నింగ్ ఇండస్ట్రీలకు పేరుగాంచిన భైంసా పట్టణంలో, పరిశ్రమల ఖాతాలు ప్రత్యేకంగా ఉంటాయి. వీటిని రోకడ్ ఖాతాలంటారు. సాధారణ ఖాతా బుక్కులకు భిన్నంగా రోకడ్ ఖాతాలు ఉంటాయని తెలిపారు. ఈ ఖాతా పుస్తకాలు విభిన్న కోణంలో ఉంటాయి. ఈ ఖాతాలను రాయాలంటే అనుభవజ్ఞులు కావాల్సిందే. మన రాష్ట్రంలోనే ప్రత్యేకంగా భైంసాలో రోకడ్ ఖాతాలు రాస్తారంటే దీనికో ప్రత్యేకత ఉంది. సంవత్సరాల తరబడి కంపెనీ లావాదేవీలు ఈ ఖాతాల్లో భద్రంగా ఉంటాయి. ప్రస్తుతం కంప్యూటర్ యుగం అయినప్పటికీ ఇప్పటికీ జిన్నింగ్ ఇండస్ట్రీలో రోకడ్ ఖాతాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో పనిచేసే నిమ్మలవార్ గంగాధర్‌కు ఈ ఖాతాలు రాయడంలో 45 సంవత్సరాల అనుభవం ఉంది. గత 15 సంవత్సరాలుగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. అదేవిధంగా జి.కిషోర్ అనే వ్యక్తికి 33 సంవత్సరాలుగా రోకడ్ ఖాతాలు రాస్తున్నారు. గత ఏడు సంవత్సరాలుగా ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్నాడు. 33 సంవత్సరాలుగా ఇదే పని చేస్తున్నానని, మరాఠీ భాషలో ఈ ఖాతాలు రాస్తామని తెలిపారు. విభిన్న రీతిలో రోకడ్ ఖాతాలు రాస్తూ, వీరు తమ వృత్తి నిర్వహణలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

ఘనంగా ఐక్యత దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా సాయుధ సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దీనికి జిల్లా అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని సిబ్బంది సమక్షంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలతో సత్కరించి, ఘన నివాళులర్పించారు. సిబ్బంది అందరిచే దేశ ఐక్యమత్యం సమగ్రత భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతానని ప్రతిజ్ఞ చేశారు. సర్దార్ స్వతంత్ర భారత తొలి హోంశాఖ మంత్రిగా సేవలందించారని అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్న 565 సంస్థానాలను విలీనం చేయడంలో కీలకపాత్రను పోషించారని తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్ స్టేట్ విలీనంలో ముఖ్యపాత్రను పోషించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, చంద్రశేఖర్, రిజర్వు సిబ్బంది, హోంగార్డు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కళాజాత బృందంతో అవగాహన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళ బృందం ద్వారా ఆసిఫాబాద్ మండలం సాలేగూడ గ్రామంలో అవగాహన కల్పించారు. దీనికి ఆసిఫాబాద్ సీఐ రవీందర్ హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా మోసపోతే 1930 నంబర్‌కి ఫిర్యాదు చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్న వెంటనే పోలీస్ స్టేషన్ లేదా 100కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళా బృందం సభ్యులు రామ్‌చందర్, రోహిత్, వెంకటేశ్, చంద్రశేఖర్, రజిత, సంఘవి పాల్గొన్నారు.

విధులను అడ్డుకున్న 13 మందిపై కేసు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అటవీ సిబ్బంది విధులను అడ్డుకున్నారనే కారణంగా కాగజ్‌నగర్, సిర్పూరు (టి)లకు చెందిన 13 మందిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ నెల 29న కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయం ముందు పలువురు ఆందోళన చేపట్టిన విషయం తెల్సిందే. తమ విధులకు ఆటంకం కల్గించారని సిర్పూరు అటవీ డిప్యూటీ రేంజ్ అధికారి గడిపెల్లి శ్రీకాంత్‌చారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివగౌడ్, కొంగ సత్యనారాయణ, సుధాకర్‌రావు, సిందం శ్రీనివాస్, సాయి, నాని, నీరటి సత్యనారాయణ, అరుణ్‌లోయ, దోని శ్రీశైలం, కొప్పుల శంకర్, దెబ్బటి శ్రీనివాస్, గోలెం వెంకటేష్, సమీర్‌గుప్తాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎదగాలని మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్ అన్నారు. పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ స్కూల్ జోనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ సాధించి జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓడినవారు కృంగిపోకుండా మళ్లీ గెలుపు కోసం ప్రయత్నించాలని, క్రీడల్లో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని గెలుపు ఓటములను పక్కనపెట్టి ప్రతి ఒక్క విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలన్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్యారమ్, చెస్, టెన్నిస్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని టీయూటీఎఫ్ సంఘ భవనంలో తలమడుగు మండల శాఖ ఎన్నికను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులుగా ముసుకు సంజీవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఆడ జగన్, ఆర్థిక కార్యదర్శి కృష్ణసాగర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులతో జిల్లా ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ మేరకు నూతన అధ్యక్షులు ముసుకు సంజీవరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు బేర దేవన్న, రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం, జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన యూత్ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన నేషనల్ సోల్జర్స్ యూత్ అసోసియేషన్ యూత్ సభ్యులు నూతన మున్సిపల్ కమిషనర్ రాజును గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం యూత్ సభ్యులు మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి విశేష సేవలందించాలని ఆకాంక్షించారు. అలాగే తమ వార్డులో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో నేషనల్ సోల్జర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, సెక్రటరీ దుర్గ ప్రసాద్, సభ్యులు కరుణాకర్, జైపాల్, రవీందర్, దివాకర్ పాల్గొన్నారు.

